మరమ్మతులకూ దిక్కులేదా?

రైతన్నలు సాగునీటి కష్టాలు తీరక నానా అవస్థలు పడుతున్నారు. రైతులకు మేలు చేస్తున్నామని చెబుతున్న కూటమి ప్రభుత్వం కొత్తగా సాగునీటి వనరులను నిర్మించకపోగా కనీసం శిథిలమైపోయిన వాటిని సైతం మరమ్మతులు చేపట్టలేదు. కనీసం నీటిని నిల్వ చేసే గ్రోయిన్లకూ మరమ్మతులు చేపట్టలేదు.



పెద్దేరులో పూర్తిగా కొట్టుకుపోయిన శ్రీరాంపట్నం గ్రోయిన్

- శిథిలావస్థలో గ్రోయిన్లు
- సాగునీరందక రైతులు ఇబ్బందులు
- ప్రధాన నదుల్లో నీరు వృథాగా దిగువకు

చోడవరం : ఏళ్ల తరబడి గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వేలాది ఎకరాలకు సాగునీటి సమస్య ఉత్పన్నమైంది. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడి రైతులు జీవిస్తున్నారు. పెద్దేరు, శారద, బొడ్డేరు నదులు ఈ ప్రాంతం మీదుగా ఉండడంతో చోడవరం, బుచ్చెయ్యపేట, మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు, అనకాపల్లి మండలంలో రైతుల ప్రయోజనార్థం చాలా ఏళ్ల కిందట గ్రోయిన్లు నిర్మించారు. అయితే వరద తాకిడి, అక్రమ ఇసుక తవ్వకాల వల్ల ఈ గ్రోయిన్లన్నీ పూర్తిగా శిథిలమయ్యాయి.

మూడు నదులపై 21 గ్రోయిన్లు

పెద్దేరు, శారదానదులపై చాకిపల్లి, భోగాపురం, శ్రీరాంపట్నం, పి.ఎస్.పేట, బెన్నవోలు, గౌరీపట్నం, ముద్దుర్తి, తగరంపూడి, సీతానగరం, జి.జగన్నాథరపురంతో పాటు సుమారు 21గ్రోయిన్లు ఉన్నాయి. ఇవన్నీ ఇప్పుడు పూర్తిగా శిథిలమైపోయాయి. ఒక్కో గ్రోయిన్ కింద 200 నుంచి 500 ఎకరాల ఆయకట్టు ఉంది. చోడవరం మండలంలో చాకిపల్లి గ్రోయిన్ కింద 250 ఎకరాలు, భోగాపురం కింద 350, శ్రీరాంపట్నం 200, పి.ఎస్‌పేట 250, బెన్నవోలు 275, గౌరీపట్నం



శిథిలమైన చాకిపల్లి గ్రోయిన్

గ్రోయిన్ కింద 1000 ఎకరాల సాగు ఆయకట్టు ఉంది. మిగతా గ్రోయిన్ల కింద కూడా సుమారు 10వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దెబ్బతిన్న గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల గడిచిన కాలంలో ఆయకట్టు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాల నుం



శారదానదిలో దెబ్బతిన్న జి.జగన్నాథపురం గ్రోయిన్

చి నీరు విడుదల చేసినప్పుడు, భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ గ్రోయిన్ల ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా దిగువకు నీరు వృథాగా పోయి సముద్రంలో కలిసిపోతుంది.

పంటలు వర్షాధారం...

అసలే వర్షాధారంపై వ్యవసాయం చేస్తున్న ఈ ప్రాంత రైతులకు ఈ గ్రోయిన్లు కూడా ఉపయోగపడకపోవడంతో పంటలకు నీరందక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసినా గ్రోయిన్ రాతి కట్లు పూర్తిగా లేకపోవడంతో నదిలో నీరు కనీసం నిలవకుండా పోతుంది. గ్రోయిన్లకు నిర్మించిన స్లూయీస్‌లు కూడా పూర్తిగా దెబ్బతినడంతో నదిలో నీరు పంటకాలువలకు పారడం లేదు. మిగతా శిథిలమైన వాటికి మరమ్మతులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నా ప్రభుత్వం నిధులు మంజూరు చేయక వీటికి మరమ్మతులు మాత్రం జరగలేదు. అనేక మార్లు వివిధ సదస్సుల్లో కూడా ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టాలని, ఈ విషయమై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఏటిలో నీరు నిల్వ ఉండడం లేదు



పెద్దేరు నదిలో బెన్నవోలు గ్రోయిన్ కింద నాకు ఎకరా ఆయకట్టు పొలం ఉంది. ఈ గ్రోయిన్ నీలం తుఫాన్‌తో పాటు ఆ తర్వాత వచ్చిన వరదలకు కొట్టుకుపోయింది. ఏటిలో నీరు నిల్వ ఉండడం లేదు. నాయకులు, అధికారులు వచ్చి గ్రోయిన్ బాగు చేస్తామని చెబుతున్నారే తప్ప ఇప్పటికీ బాగు చేయలేదు. సాగునీటికి చాలా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– రామారావు, రైతు

రాతికట్టు పూర్తిగా దెబ్బతింది



శారదానది ఒడ్డున మాకు ఎకరాన్నర పొలం ఉంది. జి.జగన్నాథపురం వద్ద ఉన్న మల్లంపేట గ్రోయిన్ కింద ఆయకట్టు భూమి మాది. మూడేళ్ల కిందట వరదలకు ఈ కట్టు కొట్టుకుపోయింది. ఇక్కడ ఇసుక కూడా ఇష్టమొచ్చినట్టే తవ్వేశారు. దీంతో గ్రోయిన్ రాతికట్టు పూర్తిగా కొట్టుకుపోయింది. నదిలో నీరు వృథాగా దిగువకు పోతుంది. దీంతో సాగునీటికి చాలా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే మరమ్మతులు చేయాలి.

– వెంకటరమణ, రైతులు, జీజేపురం

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి



సీఐ గోవిందరావు

నర్సీపట్నం : దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరని, అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని టౌన్ సీఐ జి.గోవిందరావు హెచ్చరించారు. దుకాణాల ఏర్పాటుకు సంబంధించి రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుని అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. టౌన్‌లో అనధికారికంగా బాణసంచాను నిల్వ చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. మరో పది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. విక్రయదారులు, గోదాముల నిర్వాహకులు విధిగా ఫైర్ సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే దుకాణాలు సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు.

స్టాల్స్ ఏర్పాటు స్థలం వద్ద పరిశీలన

దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే నర్సీపట్నం పెద్ద చెరువు ప్రాంతాన్ని టౌన్ సీఐ గోవిందరావు, తహసీల్దార్ రామారావు, ఫైర్ ఆఫీసర్ టి.అప్పలస్వామినాయుడు, కానిస్టేబుల్ ఎం.అప్పారావు పరిశీలించారు. దుకాణానికి దుకాణం మధ్య ఖాళీ ఉండే విధంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని లైసెన్స్‌దారులకు సూచించారు. 37 దుకాణాల వద్ద నీటితో నింపిన డ్రమ్స్‌ను పెట్టాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా వ్యాపారులు చేసుకోవాలని అధికారులు వ్యాపారులకు సూచించారు.

ఆశీల పేరుతో దోపిడీపై ఫిర్యాదు

నర్సీపట్నం : మున్సిపాలిటీలో రోడ్డు మార్జిన్ ఆశీల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని మున్సిపల్ కమిషనర్ సురేంద్రకు బీజేవైఎం రాష్ట్ర నాయకుడు అడిగర్ల సతీష్ శనివారం ఫిర్యాదు చేశారు. గజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్టు కాకుండా కాంట్రాక్టర్ పేరిట రశీదులు ముద్రించి దోపిడీకి పాల్పడుతున్నాడని, సమగ్ర విచారణ జరిపి కాంట్రాక్టు రద్దు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఆశీల ధరల బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



నాతవరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజరు సత్యవతి

నాతవరం: మండలంలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మండలంలో శనివారం తాండవ మాధవనగరం గంటావారి కొత్తగూడెం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరీ తనిఖీ చేశారు. నాతవరంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు మండలంలో పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను కోటవురట్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న సూపర్‌వైజర్లు తనిఖీలు జరిపారు. కేంద్రానికి వస్తున్న లబ్ధిదారులు వారి పేరిట ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికారం అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలు ఏవిధంగా అందిస్తున్నారో పరిశీలన చేశారు.

సాగరంలో నట్టల నివారణ కార్యక్రమం

మాడుగుల రూరల్ : గొర్రెలు, మేకలకు, ఈ నెల 31వ లోపు నట్టలు నివారణ టీకాలు వేయించుకోవాలని పశు వైద్యశాఖ పాడేరు డివిజన్ ఉపసంచాలకుడు సి.హెచ్.నరసింహులు పేర్కొన్నారు. సాగరం గ్రామంలో మేకలు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. నట్టల నివారణ ద్వారా జీవాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, గొర్రె పిల్లలో మరణాలు రేటు తగ్గుతుందని తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

నర్సీపట్నం/మాడుగుల రూరల్ : నర్సీపట్నం క్యాంపు కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం ప్రారంభించారు. మొదటి సభ్యత్వాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి స్వయంగా నమోదు చేసుకున్నారు. మాడుగులలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సభ్యత్వ నమోదును ప్రారంభించి, తొలి సభ్యత్వం పార్టీ సీనియర్ నాయకుడు పుప్పాల అప్పలరాజుకు అందజేశారు.

'చెట్టుపల్లి కార్యదర్శిని సస్పెండ్ చేయాలి'

నర్సీపట్నం : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్కీమ్ వర్కర్స్, ఆశా, అంగన్‌వాడీలతో రోడ్లు తుడిపించిన చెట్టుపల్లి పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయు డివిజన్ నాయకులు ఎ.రాజు, చిరంజీవి డిమాండ్ చేశారు. ఎవరి కార్యాలయంలో వారు కార్యక్రమం చేపట్టాలని, అందరినీ పిలిచి పంచాయతీ కార్యదర్శి రోడ్లు తుడిపించడం సరికాదని, తక్షణమే పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చోడవరంలో భారీ వర్షం

చోడవరం : తుఫాను వర్షాలతో పంట పొలాలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. ఈ అకాల వర్షం వరి పంటకు కొంత మేర నష్టం కలిగించింది. చోడవరం పరిసరాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా ఎడతెరిపిలేకుండా సుమారు 20 మిల్లీ మీటర్ల భారీ వర్షం కురిసింది. చెరకు తోటలకు కొంత మేలు చేసినప్పటికీ వరి పంటకు నష్టం కలిగింది. ప్రస్తుతం పల్లపు ప్రాంతాల్లో వరి పంట వెన్ను దశలో ఉంది.

డిగ్రీ కళాశాలను పరిశీలించిన డీఈవో



సమస్యలపై ప్రిన్సిపాల్ శాస్త్రిని అడిగి తెలుసుకుంటున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

మాడుగుల : స్థానిక డిగ్రీ కళాశాలను డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ శనివారం అకస్మికంగా సందర్శించారు. డిగ్రీ కళాశాల వసతులు, సమస్యలు గురించి కళాశాల ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాల హైస్కూల్ వసతి గృహంలో నడుస్తుందని, కళాశాలకు స్థలం కేటాయించారని, భవనాలు మంజూరు కాలేదని తెలిపారు. ప్రస్తుతం వసతి గృహంలో విద్యార్థులకు అన్ని వసతులు బాగున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎం.పాండురంగారావు, ఎంఆర్‌సీ సిబ్బంది నాగేంద్ర, రాజు, సీఆర్‌పీలు, డిగ్రీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందుల విక్రయాలకు బిల్లులు తప్పనిసరి

దేవరాపల్లి : లైసెన్స్ దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేసే రైతులక విధిగా బిల్లులు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ ఆదేశించారు. కాశీపురం శ్రీ వెంకట రోహిణి పురుగు మందుల షాపు, దేవరాపల్లిలోని హేమ రైతు డిపోను శనివారం తనిఖీ చేశారు. కొన్ని పురుగు మందుల శాంపిల్స్‌ను సేకరించి వాటిని ప్రయోగశాలలో పరీక్షలు నిమిత్తం పంపించినట్టు తెలిపారు.

పనివేళలు పాటించని ఉపాధ్యాయులు

- ఇద్దరు ఎంఈఓలుండి ఏం చేస్తున్నారు?
- మండల సమావేశంలో ఎంపీపీ ఆగ్రహం



పశుగణన గోడపత్రికను విడుదల చేస్తున్న ఎంపీపీ తదితరులు

చీడికాడ : పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ప్రతిరోజు పనివేళలకు ముందుగానే పాఠశాలలు మూసి వేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారని, ఇద్దరు ఎంఈవోలు ఉండి కూడా దానిని అరికట్టలేకపోతున్నారని ఎంపీపీ కురచా జయమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీడీవో సమావేశమందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి రోజు కోనాం తదితర ఏరియాల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ఉపాధ్యాయులు ఇళ్లకు వెళ్లిపోతున్నారని అన్నారు. మండలానికి ఇద్దరు ఎంఈవోలు ఉండి కూడా ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ, హౌసింగ్ అధికారులు మాట్లాడుతుండగా ప్రభుత్వ పథకాల విషయమై గ్రామాల్లోకి వచ్చే అధికారులు ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలకు ప్రోటోకాల్ ప్రకారం సమాచారం ఇవ్వాల్సి ఉండగా ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దీంతో టీడీపీకి చెందిన పలువురు సభ్యులు మీ ప్రభుత్వంలో మాకు సమాచారం ఇచ్చారా అని ప్రశ్నించగా మా ప్రభుత్వంలో ఎటువంటి వివక్ష చూపలేదని, ఎంపీపీతో పాటు వైఎస్ఆర్‌సీపీ సభ్యులు బదులిచ్చారు. ఎంపీడీఓ హేమచందర్ కలుగజేసుకుని ఇకపై ప్రతి గ్రామస్థాయిలో ఉండే సర్పంచ్, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. కోనాం జలాశయం సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కోటి రూపాయలు కేటాయించిందని ఇరిగేషన్ ఏఈ జయరాం తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో హేమచందర్, వైస్ ఎంపీపీలు స్వాతి, చిన్నమ్మ పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యల ఏకరువు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు, తదితరులు

మాడుగుల : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ప్రభుత్వ కార్యక్రమాలు గ్రామాల్లో ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు తెలియజేయడం లేదని సభ్యులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. ఇకపై గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు తప్పక తెలియజేయాలని అధికారులను ఎమ్మెల్యే హెచ్చరించారు. పంట కాలం పూర్తయిన తర్వాత ఎరువులు పంపిణీ చేస్తున్నారని, ఆర్‌బీకేల ద్వారా ఎరువులు పంపిణీ చేయాలని, ఎం.కోటపాడు ఉప సర్పంచ్ శేనాపతి గంగాధర్ కోరారు. 30 గ్రామాలకు ఆధారమైన కింతలి పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది లేరని ఎంపీటీసీ మైచర్ల సన్యాసిరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. సాగరం నుంచి మాడుగులకు రోడ్డుతో పాటు తాచేరుపై వంతెన నిర్మాణం పూర్తయినందున పాడేరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు సాగరం మీదుగా మాడుగులకు ఏర్పాటు చేయాలని, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గొటివాడ అంగన్‌వాడీ కేంద్ర భవనాలకు ప్రతిపాదనలు పంపామని, 13 కేంద్రాలకు టాయిలెట్స్ మరో 13 కేంద్రాలకు తాగునీటికి నిధులు మంజూరయ్యాయని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి తెలిపారు. జేజేఎం ద్వారా 143 పనులు మంజూరు కాగా ఇంత వరకు 75 పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు పూర్తికాగానే రోడ్లకు పడిన గోతులు మరమ్మతులు చేపడతామని ఆర్‌డబ్ల్యూస్ జేఈ మల్లేశ్వరి తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ రమణమ్మ, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో అప్పారావు, ఎంఈవో పాండురంగారావు పాల్గొన్నారు.

ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

మాడుగుల రూరల్ : అగనంపూడి హోమిబాబా క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం క్యాన్సర్ అనుమానితులుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు రొమ్ము క్యాన్సర్, తదితర వాటి లక్షణాలు గురించి అవగాహన కల్పించారు. కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో 14 మందికి, కింతలి పీహెచ్‌సీ పరిధిలో 33 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.జె.పురం పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి సుజాత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, హోమిబాబా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రత్యేక శిక్షణ



విద్యార్థులతో వ్యాయామం చేయిస్తున్న పీడీ గోవింద

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీ స్కౌట్ అండ్ గైడ్స్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను పీడీ ఎస్.గోవింద చేపట్టారు. అందుకు తగ్గట్టు యూనిఫాం డ్రెస్‌లను కూడా మార్పు చేశారు. విద్యార్థులకు శనివారం స్కౌట్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ప్రధానంగా శాంతి వాతావరణం, సమాజంలో సేవా కార్యక్రమాల అమలు గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంపై విద్యార్థులంతా ఎంతో ఆసక్తి చూపడంపై హెచ్ఎం డి.వి.ఎస్.ఎస్. ప్రసాద్ సంతృప్తి వ్యక్తం చేశారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలను రోల్‌మోడల్‌గా తయారు చేయాలని పీడీకి సూచించారు.

జవహర్‌క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు



పోతల ప్రకాశరావు

చోడవరం : చోడవరం జవహర్ క్లబ్ నూతన అధ్యక్షుడుగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది పోతల ప్రకాశరావు ఎన్నికయ్యారు. అధ్యక్షుడుగా పోతల ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడుగా బుద్ధ వెంకటరమణ, కోశాధికారిగా పూసర్ల రవీంద్ర ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా మధుసూధరావు, జగన్నాథకుమార్, దేవరపల్లి వెంకటరావు, చావలి మురళీకృష్ణ, ఈశ్వరరావు, పూసర్ల లక్ష్మణరావు ఎన్నికయ్యారు.

మాడుగుల ఆస్పత్రిలో స్వచ్ఛతా హీ సేవ



మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో తుప్పలు, డొంకలు తొలగిస్తున్న ఎంపీడీవో తదితరులు

మాడుగుల రూరల్ : మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం తుప్పలు, డొంకలు తొలగించారు. స్థానిక ఎంపీడీవో కొంకి అప్పారావు, మండల పంచాయతీ విస్తరణాధికారి కె. కరుణాకర్, సర్పంచ్ కళావతి, తదితరుల సారధ్యంలో ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోపారిశుధ్య సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాస రావు, పంచాయతీ ఈఓ మూర్తిబాబు, వార్డు సభ్యుడు సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

మాకవరపాలెం : ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మండల ప్రత్యేక అధికారి మనోరమ అన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయం సమీపంలో చేపట్టిన చెత్త తొలగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని ఊడ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహలక్ష్మి, కార్యదర్శి బాలదొర పాల్గొన్నారు.

గొలుగొండ : గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్ తెలిపారు. ఏఎల్‌పురం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు.

నాతవరం : రోగాలు నివారించాలంటే ముందుగా ఇండ్ల పరిసరాలతో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. ఆయన శనివారం మండల కేంద్రంలో తన కార్యాలయం వద్ద స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో భాగంగా చెత్తను తొలగించారు.

రెవెన్యూ సదస్సుల్లో అర్జీల స్వీకారం

నాతవరం/గొలుగొండ/కె.కోటపాడు/ మాడుగుల రూరల్ : నాతవరం తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ ఆధ్వర్యంలో చమ్మచింత పంచాయతీ శివారు కురువాడ గ్రామంలో శనివారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. 31 మంది రైతులు అర్జీలు అందించారు. గొలుగొండ మండలం నాగన్నదొరపాలెంలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో రైతులు తమ భూ సమస్యలపై ఫిర్యాదులు అందించారు. కె.కోటపాడు మండలం డి.అగ్రహారం గ్రామంలో రైతులు 14 మంది అర్జీలను అందించారు. త్వరలో పరిష్కారాన్ని చూపనున్నట్లు తహసీల్దార్ భాగ్యవతి పేర్కొన్నారు. మాడుగుల మండలం వీరనారాయణంలో డీటీ ఎస్.గణపతిరావుకు 9 మంది రైతులు అర్జీలు అందజేశారు.

ఐటీఐ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న జెడ్పీటీసీ రమణమ్మ

నర్సీపట్నం : పెదబొడ్డేపల్లి భూషణ్ ఐటీఐలో 2023–24 సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన జెడ్పీటీసీ సుకల రమణమ్మ ఉత్తమ విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. వృత్తివిద్యకు ఎంతో ఆదరణ ఉందని, భవిష్యత్‌లో ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. ఐటీఐ ప్రిన్సిపాల్ బంగారునాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీడిమామిడి తోటలకు స్వచ్ఛంద బీమా పథకం

ఎకరాకు రూ. 1540 ప్రీమియం చెల్లించాలి

మాడుగుల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం 2024–25 రబీ సీజన్‌కుగాను జీడి మామిడి తోటలకు స్వచ్ఛంద బీమా పథకం ప్రవేశ పెట్టిందని మండల ఉద్యానవన శాఖాధికారి వి. భాను పుష్పలీలావతి పేర్కొన్నారు. శనివారం ఆమె కె.జె.పురంలో సాక్షితో మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో జీడిమామిడి పంటను బీమా పథకంలో చేర్చడం జరిగిందని, రైతులు స్వచ్ఛంద బీమాలో భాగంగా ఒక ఎకరానికి బీమా ప్రీమియంగా రూ 1540 చెల్లించాలని, ఒక రైతు ఎన్ని ఎకరాలు అయినా బీమా చేసుకోవచ్చునని, ఒక ఎకరానికి బీమా హామీ మొత్తం రూ. 30,800 ఉంటుదన్నారు. పంట రుణం తీసుకోని వారు ఈ బీమా ప్రీమియంను కామన్ సర్వీసు కేంద్రాలు (సి.యస్.సి) ద్వారా లేదా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్) లు ద్వారా లేదా, బ్యాంకుల్లో, జిల్లాకు ఎంపిక చేసిన కంపెనీ ద్వారా గానీ లేదా రైతు నేరుగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్ లో చేసుకోవాల్సి ఉంటుదన్నారు. అలాగే బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్నవారు నేరుగా బ్యాంకు వారిని సంప్రదించాలన్నారు.

ఘనంగా ఎంపీపీ రాజారామ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల : స్థానిక ఎంపిపి తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ జన్మదిన వేడుకలు శనివారం స్థానిక ఎంపీపీ కార్యాలయం సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకుల నడుమ ఆయనతో కేక్ కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో కొంకి అప్పారావు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కె.రమణమ్మ, ఎంపీటీసీ సభ్యులు పోలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, దండి నాగరత్నం, ముమ్మిన రమణబాబు, సూర్యకాంతం, ఆర్లె ఉమాదేవి, సంతోషి, తలారి అప్పారావు, చదల కృష్ణమూర్తి, మండల కోఆప్షన్ సభ్యురాలు షేక్ ఉన్నీసా, సర్పంచ్‌లు గొల్లవిల్లి సంజీవిరావు, కిళ్లిరెడ్డి కృష్ణమూర్తి, అల్లాడ నాగేశ్వరావు, జామి రమణబాబు, మాజీ సర్పంచ్ కల్యాణరాజుతో పాటు నాయకులు శానాపతి గంగాధర్, శ్రీనాధు జగ్గారావు పాల్గొన్నారు.

ఎం.కోడూరు మోదకొండమ్మకు రెండు కిలోల వెండి సమర్పణ



సర్పంచ్ సంజీవిరావుకు వెండిని అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామ ఆరాధ్య దైవం, మోదకొండమ్మ ఆలయానికి మాడుగుల గ్రామానికి చెందిన సాలారు బాబా కృపనిధి, భారతీదేవి, చెతన్య దీపక్ సృజన, శరత్ కిరణ్ కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారంతో అమ్మవారి ఆలంకరణ నిమిత్తం వెండిని శనివారం అందజేశారు. అమ్మవారి అలంకరణ నిమిత్తం వడ్డాణం, హారం, నిమిత్తం రెండు కిలోల వెండిని గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. దీని ఖరీదు సుమారు రెండు లక్షలు ఉంటుంది. సాగరం గ్రామానికి చెందిన గుంపాన అప్పలనాయుడు కుటుంబ సభ్యులు, ఉప సర్పంచ్ రాజేశ్‌కుమార్, వార్డు సభ్యుడు జగదీశ్ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్‌కు సత్కారం

చోడవరం రూరల్ : సీనియర్ విద్యార్థులు తమ జూనియర్లకు మార్గదర్శకులుగా మెలిగితేనే ఫ్రెషర్స్‌డే వేడుకలకు సార్థకత అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. శనివా రం కళాశాలలో ఫ్రెషర్స్‌డే సంబరంగా జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణ, నైతిక విలువలపై నూతన విద్యార్థులకు అవగాహన కల్పించాలి తప్ప ర్యాగింగ్ జోలికి వెళ్లరాదని హితవు పలికారు. కాగా రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా ఏపీ ఉన్నత శాఖ నుంచి శుక్రవారమే ఉత్తర్వులను అందుకున్న కిరణ్‌కుమార్‌ను సహ ఉపన్యాసకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

మాడుగుల రూరల్: మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకన్న పేర్కొన్నారు. శంకరం గ్రామంలో మండల కార్యదర్శి ఇ.నర్సింహమూర్తి అధ్యక్షతన జరిగిన సీపీఎం మహాసభలో లోకనాథం మాట్లాడుతు మండలంలో అత్యధికంగా గిరిజన గ్రామాలు ఉన్నాయని, వాటిని ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని, డిమాండ్ చేశారు. పెద్దేరు ఎడమ కాలువ 4 ఎల్ఎ ద్వారా ఏడు గిరిజన గ్రామాలకు సాగునీరు అందిస్తామని భూసేకరణ చేసి, నేటికీ సాగునీరు అందివ్వలేదని అన్నారు. ఉరకగెడ్డ పునరావాస గిరిజనులకు ఆర్.ఆర్.ప్యాకేజీ ద్వారా నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

వ్యాసరచన పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు



విజేతలతో గురుకుల ప్రిన్సిపాల్ రఘు

దేవరాపల్లి : తెనుగుపూడి డా. బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో స్మార్ట్ ఇండియా నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై స్థానిక విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టాటా బిల్డింగ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సీనియర్ విభాగంలో పి. సాయికుమార్, ఎం.మణికంఠ, హరి ప్రథమ, ద్వితీ య, తృతీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ విభాగంలో ఎం.జశ్వంత్‌కుమార్, వి.యశ్వంత్‌కుమార్, కె.వెంకట మురళీకృష్ణ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. ఆయా విద్యార్థులకు స్థానిక గురుకుల ప్రిన్సిపాల్ పి.రఘు, వైస్ ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. విజేతలను పేరెంట్స్ కమిటీ చైర్మన్ నర్సింహమూర్తి, మాజీ చైర్మన్ ఉల్లి శ్రీను అభినందించారు.

పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి

బుచ్చెయ్యపేట: జిల్లాలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ సి.ఎం.రమేష్ తెలిపారు. శనివారం బుచ్చెయ్యపేట మండలం పి.భీమవరంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామ్మూర్తి ఏర్పాటు చేసిన ఆతీ్మయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నక్కపల్లి వద్ద త్వరలో ఏర్పాటు చేసే సెజ్ ప్రారంభోత్సవానికి ప్రధానిని తీసుకురావాలని ఆశిస్తున్నానన్నారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు.